గురువారం 13-6-2024

# ముందడుగు




మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com

సంపుటి: 1, సంచిక: 363, పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

దినపత్రిక

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD




## మోడీ ఓటమి నుంచి తప్పించుకున్నారు

- అయోధ్య ప్రజల చేతిలో బిజెపి ఓడినట్లే
- కేరళ మలప్పురం సమావేశంలో రాహుల్ గాంధీ

**ముందడుగు కేరళ:**

వారణాసిలో పోటీ చేసిన ప్రధాని నరేంద్ర మోడీ ఓటమి నుంచి తప్పించుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. కేరళలోని మలప్పురంలో ఓ సమావేశంలో రాహుల్ గాంధీ పాల్గొని ప్రసంగించారు. అయోధ్య ప్రజల చేతిలో బిజెపి ఓడినట్లే వారణాసిలో మోడీ ఓడిపోయి ఉండేవారని వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి కావాల్సిన సీట్లు బిజెపి ఒంటరిగా సాధించకపోవడానికి మోడీ నైతిక బాధ్యత వహించాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలు మాట్లాడారని, కానీ అదే రాజ్యాంగానికి ప్రమాణస్వీకారం వేళ మోడీ దండం పెట్టుకున్నారని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు వారికి ఏం **మిగతా 2లో**

## నీటినంతా ట్యాంకర్ మాఫియా
# మింగేసింది

- నీరు వృథాపై ఏలాంటి చర్యలు తీసుకున్నారు
- ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు





**ముందడుగు ఢిల్లీ:**

దేశ రాజధాని నగరం ఢిల్లీలో రోజు రోజుకు నీటి కొరత పెరిగిపోతుంది. ప్రజలు నీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ట్యాంకర్ మాఫియా కట్టడికి, నీటి వృథాను అరికట్టడానికి ఆప్ నేతృత్వంలోని ఢిల్లీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటోందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. హిమాచల్ ప్రదేశ్ నుంచి మిగులుజలాలు విడుదల కోరుతూ అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం చేసిన అభ్యర్థన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం స్పందించింది. ట్యాంకర్ మాఫియా విస్తృతంగా కనిపిస్తోంది. ఆ నీటినంతా ఆ మాఫియా మింగేసింది. నీరు వృథా అవుతోంది. దానిపై మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు. హిమాచల్ ప్రదేశ్ నుంచి వస్తోన్న నీరు ఎటుపోతోంది? ప్రజలు బాధపడుతున్నారు. మీడియాలో ఆ దృశ్యాలను మేం చూస్తున్నాం. వేసవిలో నీటి ఎద్దడి పదేపదే ఎదురవుతుంటే.. వృథాను అరికట్టడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?'' అని ప్రశ్నించింది. కోర్టు ముందు ఎందుకు అసత్య ప్రకటనలు చేస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేసింది. ప్రభుత్వం చర్యలు తీసుకోలేకపోతే.. ఆ పని పోలీసులకు అప్పగిస్తామని వ్యాఖ్యానించింది.



### కోటి ఖర్చు చేసి మామను చంపించిన మహిళ

వివరాలు 2లో



### అత్తను 95సార్లు పొడిచి చంపిన కోడలికి మరణశిక్ష

వివరాలు 2లో



### రైల్లో చిప్స్ కవర్ పడేసినందుకు జరిమానా

వివరాలు 3లో



### ఆ గ్రామస్తులు ఏటా 5 కోట్ల పన్నులు చెల్లిస్తారు

వివరాలు 4లో

## ఏపీ సీఎంగా చంద్రబాబు
# ప్రమాణస్వీకారం

**ప్రధాని మోడీతో పాటు పలువురు ప్రముఖులు హాజరు**

**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**



ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ **మిగతా 2లో**



## కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

- 40 మందికిపైగా సజీవదహనం
- మృతుల్లో భారత్ కార్మికులు
- పొగ పీల్చడం వల్లే ఎక్కువ మరణాలు

**ముందడుగు కువైట్:**

కువైట్ మంగాఫ్ నగరంలో కార్మికులు నివాసం ఉంటున్న ఓ అపార్ట్‌మెంట్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 40 మందికిపైగా సజీవదహనం అయ్యారు. మృతుల్లో **మిగతా 2లో**

ముందడుగు
గురువారం, 13-6-2024, హైదరాబాద్

### నీటినంతా ట్యాంకర్ మాఫియా

# మింగేసింది

మొదటిపేజీ తరువాయి

దీనిపై ఢిల్లీ తరఫు న్యాయవాది కోర్టులో తన వాదన వినిపించారు. నీటి వృథా కట్టడికి తీసుకుంటున్న చర్యలను వెల్లడించిన ఆయన.. వాటిపై ఒక అఫిడవిట్ దాఖలు చేస్తామని చెప్పారు. ఆ దిశగా వెంటనే నివేదికను సమర్పించాలని కోర్టు ఆదేశించింది. తప్పుడు ప్రకటనలు చేస్తున్నారంటూ ఈ సందర్భంగా హిమాచల్ ప్రభుత్వాన్ని కూడా మందలించింది. అలాగే విచారణను గురువారానికి వాయిదా వేసింది.

### మోడీ ఓటమి నుంచి

# తప్పించుకున్నారు

మొదటిపేజీ తరువాయి

కావాలో ప్రధానికి స్పష్టంగా తెలిసేలా చేశారన్నారు. మోడీ వారణాసిలో కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్‌పై 1,50,000 ఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. అయోధ్యలో సమాజ్ వాదీ పార్టీకి చెందిన అవదేశ్ ప్రసాద్ బిజెపి అభ్యర్థి లల్లూ సింగ్‌పై విజయం సాధించారు. బిజెపి కంచుకోట అయిన ఉత్తరప్రదేశ్‌లో ఆరు స్థానాలతో సహా మొత్తం 99 స్థానాలను ఇండియా గెలుచుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి 240 సీట్లలో విజయం సాధించినా, ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడానికి మరో 32 సీట్లు కావాల్సి రావడంతో చంద్రబాబునాయుడు(టీడీపీ), నీతీశ్‌కుమార్ (జేడీయూ) సహాయం తీసుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది.

# కోటి ఖర్చు చేసి మామను చంపించిన మహిళ

## సుమారు రూ.300 కోట్ల ఆస్తి కోసం దారుణం

**ముందడుగు మహారాష్ట్ర**

ఒక మహిళ సుమారు రూ.300 కోట్ల ఆస్తిని దక్కించుకునేందుకు కోటి ఖర్చు చేసి మామను చంపించింది. పోలీసుల దర్యాప్తులో ఈ విషయం బయటపడింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగి అయిన ఆ మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ సంఘటన జరిగింది. మే నెలలో 82 ఏళ్ల పురుషోత్తం పుట్టేవార్ భార్యకు సర్జరీ జరిగింది. కోలుకుంటున్న ఆమెను చూసేందుకు పురుషోత్తం ఆసుపత్రికి వెళ్లాడు. ఇంటికి తిరిగి వస్తుండగా ఒక కారు వేగంగా ఆ వృద్ధుడ్ని ఢీకొట్టి మీద నుంచి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ వృద్ధుడు మరణించాడు.



ఈ రోడ్డు ప్రమాదంపై పోలీసులు దర్యాప్తు జరిపారు. వృద్ధుడు పురుషోత్తంను ఢీకొట్టిన కారు డ్రైవర్‌ను గుర్తించి అరెస్ట్ చేశారు. ఆ నిందితుడు వృద్ధుడి కుమారుడి కారు డ్రైవర్‌గా పోలీసులు తెలుసుకున్నారు. అతడ్ని ప్రశ్నించగా వృద్ధుడి కోడలైన 53 ఏళ్ల అర్చనా మనీష్ పుట్టేవార్ ఆస్తి కోసం మామను హత్య చేయించినట్లు వెలుగులోకి వచ్చింది. దీని కోసం ఆమె కోటి ఖర్చు చేసినట్లు దర్యాప్తులో పోలీసులు తెలుసుకున్నారు. మరోవైపు డాక్టరైన భర్త మనీష్ కారు డ్రైవర్ బాగ్డే, నీరజ్ నిమ్జే, సచిన్ ధార్మిక్‌లతో కలిసి మామ పరుషోత్తం హత్యకు కోడలు అర్చన కుట్రపన్నినట్లు దర్యాప్తులో తేలింది. రోడ్డు ప్రమాదంలో మామ మరణించినట్లుగా నమ్మించేందుకు సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయించింది. మామను చంపేందుకు నిందితులకు ఆమె కోటి చెల్లించినట్లు పోలీసులు తెలుసుకున్నారు. పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ డైరెక్టర్ అయిన అర్చనతోపాటు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. రెండు కార్లు, బంగారు నగలు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

### ఏపీ సీఎంగా చంద్రబాబు

# ప్రమాణస్వీకారం

మొదటిపేజీ తరువాయి

అబ్దుల్ నజీర్ ఆయనతో ప్రమాణం చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. అనంతరం మంత్రులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగిపోయింది. తెదేపా నేతలు, కార్యకర్తలు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో పాటు వేదికపై ఉన్న పలువురు అతిథులు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, చిరాగ్ పాసవాన్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు వచ్చారు.


### అత్తను 95సార్లు పొడిచి చంపిన

# కోడలికి మరణశిక్ష

## మధ్యప్రదేశ్ కోర్టు తీర్పు

**ముందడుగు:**

ఒక కోడలు తన అత్తను 95 సార్లు కొడవలితో పొడిచి చంపింది. ఈ కేసులో కోడలికి మధ్యప్రదేశ్ కోర్టు మరణశిక్షను విధించింది. 2022లో రేవా జిల్లాలో ఈ ఘటన జరిగింది. జిల్లా నాలుగవ అదనపు సెషన్స్‌జడ్జి పద్మా జాతవ్ ఈ కేసులో తీర్పును ఇచ్చారు. 50 ఏళ్ల సరోజ్ కోల్‌ను.. 24 ఏళ్ల కంచన్ కోల్ హత్య చేసినట్లు కోర్టు ధ్రువీకరించింది. మన్‌గావా పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న అత్రైలా గ్రామం వాసి అయిన కంచన్.. తన అత్తను కొడవలితో 95 సార్లు పొడిచింది. ఇంట్లో గొడవ జరగడంతో 2022, జూలై 112న ఆమె ఆ దాడికి పాల్పడింది. దాడి జరిగిన సమయంలో బాధితురాలు ఒక్కరే ఇంట్లో ఉన్నారు. సరోజ్ కోల్ భర్త వాల్మిక్ కోల్‌ను కూడా ఈ కేసులో చేర్చారు. అతను రెచ్చగొట్టడం వల్లే కోడల హత్యకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు.



### వందేభారత్‌లో టికెట్ లేని

# ప్రయాణికులు

## పాత వీడియో అని స్పందించిన రైల్వే శాఖ

**ముందడుగు జాతీయం:**

రైలు ప్రయాణికులు కొంతమంది టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తూ టీసీకి దొరికిపోయిన సందర్భాలు చాలానే చూశాం. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన వందేభారత్ రైలులోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉన్న వీడియో ఒకటి నెట్టింట వైరల్‌గా మారింది. అత్యాధునిక సౌకర్యాలతో రూపొందించిన ఈ రైలు.. టికెట్ కొనుగోలు చేయకుండా ప్రయాణిస్తున్న వారితో కిటకిటలాడింది. లఖ్‌నవూ నుంచి డెహ్రాడూన్ మధ్య ప్రయాణించిన వందే భారత్ రైలులో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించిన వీడియోను షేర్ చేసిన ఓ వ్యక్తి ప్రీమియం రైలులో ఈ పరిస్థితి తలెత్తడంపై ఆందోళన వ్యక్తంచేశారు. నెటిజన్లు స్పందిస్తూ.. దేశంలో మరికొన్ని రైళ్లను నిర్మించడం లేదా బోగీలను పెంచే ఏర్పాటు





చేయాలని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు. వైరల్‌గా మారిన ఈ వీడియోపై ఉత్తర రైల్వేశాఖ స్పందించింది. ఇది పాత వీడియో అని స్పష్టంచేసింది. ''కొందరు రైతులు బలవంతంగా రైలులోకి ఎక్కినప్పుడు జరిగిన సంఘటన ఇది. పాత వీడియోను ప్రస్తుతం షేర్ చేశారు. దయచేసి ఇలాంటివి ప్రచారం చేయకండి. ప్రయాణికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోండి'' అని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా పేర్కొంది.

# కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి

ఐదుగురు భారతీయులు ఉన్నట్లు కువైట్ మీడియా తెలిపింది. బుధవారం తెల్లవారుజామున కార్మికులు నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా భారీ ఎత్తున మంటలు చెలరేగాయి. అవి క్షణాల్లో పై అంతస్తు వరకూ వ్యాపించాయి. మంటలకు తోడు దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో అందులో నివసిస్తున్న వారు బయటకు వచ్చేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ఇప్పటివరకూ 41 మంది ప్రాణాలు కోల్పోయినట్లు స్థానిక మీడియా తెలిపింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. 'అగ్ని ప్రమాదం సభవించిన భవనంలో పెద్ద సంఖ్యలో కార్మికులు ఉంటున్నారు. ఘటన అనంతరం చాలా మందిని రక్షించాం. కానీ దురదృష్టవశాత్తూ మంటల ధాటికి పొగ పీల్చడం వల్ల చాలా మంది మరణించారు' అని సీనియర్ పోలీస్ కమాండర్ ఒకరు తెలిపారు. సుమారు 50 మందిని ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఘటనాస్థలి వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనకు గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సదరు కమాండర్ వెల్లడించారు.

ముందడుగు
గురువారం,
13-6-2024,
హైదరాబాద్

# చంద్రబాబు టీంలో 17 మంది కొత్త వారే

## ప్రమాణ స్వీకారం చేసిన నాయకులు వీరే..



**ముందడుగు ఆంధ్రప్రదేశ్:**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెదేపా అధినేత చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు హాజరయ్యారు.

### 17 మంది కొత్త వారికి చోటు

మంత్రివర్గ కూర్పులో భాగంగా జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు. తెదేపా నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. భాజపా నుంచి సత్యకుమార్ యాదవ్‌కు అవకాశం దక్కింది.

ప్రమాణ స్వీకారం చేసింది వీరే..

1. పవన్ కల్యాణ్ (జనసేన)
2. నారా లోకేశ్ (తెదేపా)
3. అచ్చెన్నాయుడు (తెదేపా)
4. కొల్లు రవీంద్ర (తెదేపా)
5. నాదెండ్ల మనోహర్ (జనసేన)
6. పి. నారాయణ (తెదేపా)
7. వంగలపూడి అనిత (తెదేపా)
8. సత్యకుమార్ యాదవ్ (భాజపా)
9. నిమ్మల రామానాయుడు (తెదేపా)
10. ఎన్.ఎమ్.డి ఫరూక్ (తెదేపా)
11. ఆనం రామనారాయణరెడ్డి (తెదేపా)
12. పయ్యావుల కేశవ్ (తెదేపా)
13. అనగాని సత్యప్రసాద్ (తెదేపా)
14. కొలుసు పార్థసారథి (తెదేపా)
15. డోలా బాలవీరాంజనేయస్వామి (తెదేపా)
16. గొట్టిపాటి రవి (తెదేపా)
17. కందుల దుర్గేశ్ (జనసేన)
18. గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా)
19. బీసీ జనార్దన్‌రెడ్డి (తెదేపా)
20. టీజీ భరత్ (తెదేపా)
21. ఎస్.సవిత (తెదేపా)
22. వాసంశెట్టి సుభాష్ (తెదేపా)
23. కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా)
24. మందిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి (తెదేపా)



# రైల్లో చిప్స్ కవర్ పడేసినందుకు జరిమానా

- రూల్స్ ఫాలో అవ్వని వారికి భారీగా పెనాల్టీ
- రైళ్లలో పరిశుభ్రతపై రైల్వే శాఖ అవగాహన

**ముందడుగు రైల్వేశాఖ:**

రైల్వేలో ప్రయాణించే ప్రయాణీకులు కోచ్‌లో చెత్త వేస్తే రైల్వే శాఖ జరిమానా విధిస్తోంది. తాజాగా ఓ ప్యాసింజర్ ఇలాగే చెత్త వేయగా, అధికారులు ఆ ప్యాకెట్ విలువకు 10 రెట్లు జరిమానా విధించారు. రైళ్లలో పరిశుభ్రత పాటించేలా రైల్వే శాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఆగ్రా డివిజన్‌పై సంస్థ ఫోకస్ పెట్టింది. ఇక్కడికి పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండటంతో భారీగా చెత్త పోగవుతోంది. దీంతో రైళ్లలో చెత్త వేసిన వారికి రైల్వే శాఖ జరిమానా విధించడం మొదలుపెట్టింది. రూల్స్ ఫాలో అవ్వని వారికి భారీగా జరిమానా విధిస్తోంది. సీటు కిందే చిప్స్, బిస్కిట్ ప్యాకెట్ కవర్లు ఆగ్రా డివిజన్‌లో ఎంత అవగాహన కల్పిస్తున్నా ప్యాసింజర్లు మారట్లేదు. దీంతో తాజాగా ఈ డివిజన్ పరిధిలోని ఒక రైలులో ట్రావెల్ చేస్తున్న ప్రయాణికునికి రైల్వే శాఖ షాక్ ఇచ్చింది. బిస్కెట్లు, చిప్స్ తిని, ఆ ప్యాకేజ్ కవర్లను ప్రయాణికుడు సీటు కిందే పడేశాడు. ఎప్పటిలాగే చెకింగ్‌కు వచ్చిన రైల్వే అధికారులు దీనిని గమనించారు. దీంతో ఆ ప్రయాణికునికి జరిమానా విధించారు. అతడు పడేసిన కవర్ల ధరకు 10 రెట్లు ఫైన్ వేశారు. బిస్కెట్స్, చిప్స్ ప్యాకెట్ల ధర రూ.20గా గుర్తించి, రూ.200 జరిమానా విధించారు. అతడితో పాటు చాలామంది ప్రయాణికులు అడ్డంగా దొరికిపోయారు.

### నిబంధనలు కఠినతరం

**ప్రయాణికుల నిర్లక్ష్యంపై రైల్వే అధికారులు సీరియస్ అవుతున్నారు. ట్రైన్ కోచ్‌ల్లో చెత్తాచెదారం పడేస్తున్న వారికి ఫైన్ వేస్తున్నారు. ఇలా ఆగ్రా డివిజన్‌లోనే ఇప్పటివరకు 304 మందికి జరిమానా విధించారు. వీటి ద్వారా రూ.1,23,075 కలెక్ట్ చేశారు. రైళ్లలో ట్రావెల్ చేసేటప్పుడు ప్యాసింజర్లు అన్ని రూల్స్ పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.**


# చనిపోయాడనుకొని అంత్యక్రియలు చేసారు

## దశ దిన కర్మ రోజున ఇంటికి వచ్చిన వ్యక్తి

**ముందడుగు మధ్యప్రదేశ్:**

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి చనిపోయాడనుకొని కుటుంబసభ్యులు అతడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించింది. అయితే పెద్ద కర్మ ముందు రోజు ఆ వ్యక్తి తన కుటుంబానికి ఫోన్ చేశాడు. ఆ తర్వాత ఇంటికి తిరిగి వచ్చాడు. అతడు బతికే ఉన్నాడని తెలుసుకున్న కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. లహచోరా గ్రామానికి చెందిన సురేంద్ర శర్మ, రాజస్థాన్ రాజధాని జైపూర్‌లోని క్లాత్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. రాజస్థాన్‌లోని సవాయ్ మాధోపూర్ సమీపంలోని సుర్వాల్‌లో గత నెలలో రోడ్డు ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని గుర్తించాలని కోరుతూ సామాజిక కార్యకర్త ఒక ఫొటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. ఆ వ్యక్తిని సురేంద్రగా అతడి కుటుంబ సభ్యులు గుర్తించారు. జైపూర్‌లోని ఆసుపత్రికి వారు తరలించగా చికిత్స పొందుతూ అతడు మరణించాడు. దీంతో రాజస్థాన్ పోలీసులు పోస్ట్‌మార్టం తర్వాత ఆ వ్యక్తి మృతదేహాన్ని సురేంద్ర కుటుంబానికి అప్పగించారు. మే 28న అంత్యక్రియలు నిర్వహించారు.

మరోవైపు 13వ రోజున సురేంద్రకు దశ దిన కర్మలు చేసేందుకు అతడి కుటుంబం సిద్ధమైంది. అయితే ముందు రోజు సురేంద్ర నుంచి ఫోన్ వచ్చింది. నమ్మని సోదరుడు వీడియో కాల్ చేయాలని చెప్పాడు. అతడు వీడియో కాల్ చేయగా సురేంద్ర బతికే ఉన్నాడని కుటుంబ సభ్యులు తెలుసుకుని షాక్ అయ్యారు.




# ఎఫ్ఎంసీజీ బ్రాండ్‌లకు డిజిటల్ అత్యంత లాభదాయకమైన ఛానెల్

**ముందడుగు హైదరాబాద్:**

ముంబయిలో నిర్వహించిన మెటా మార్కెటింగ్ సదస్సు ఎఫ్ఎంసీజీ ఎడిషన్‌లో దేశంలోని ఎఫ్ఎంసీజీ రంగానికి డిజిటల్ అవసరాన్ని, వృద్ధి చెందుతున్న ప్రాధాన్యతలను తెలిపే ప్రముఖ మార్కెట్ అధ్యయన సంస్థలు నీల్సన్ మరియు కాంటార్‌లతో మెటా చేపట్టిన పలు అధ్యయనాల ఫలితాలను కంపెనీ ప్రకటించింది. కీలక ఫలితాలలో, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లుగా వ్యవహరించే అధ్యయనాలు, ముఖ్యంగా మెటా, బ్రాండ్ ఇమేజరీ, ఈక్విటీ మరియు వర్గాలలో పెట్టుబడిపై అధిక రాబడిని తీసుకురావడంలో కీలకమైన స్తంభంగా ఉంది. మెటా, యాడ్స్ బిజినెస్ డైరెక్టర్ మరియు హెడ్ (ఇండియా) అరుణ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, "దేశం మొత్తంలో ప్రకటనలకు ఎఫ్ఎంసీజీ పరిశ్రమ ప్రముఖ సహకారాన్ని అందిస్తోంది. దాని మాధ్యమాల వినియోగ విధానాలలో దేశంలో గణనీయమైన మార్పు వస్తుండగా, అందులో పర్యావరణ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థలు, సృజనాత్మకత కూడా ముడిపడి ఉన్నాయని అన్నారు.

ముందడుగు
గురువారం, 13-6-2024, హైదరాబాద్

## భారతదేశంలో విడుదలైన
# షవోమీ 14 CIVI



**ముందడుగు హైదరాబాద్:**

టెక్నాలజీ, ఆవిష్కరణలలో గ్లోబల్ లీడర్ షవోమీ, ప్రశంసలు దక్కించుకున్న షవోమీ 14 సిరీస్‌కి అద్భుతమైన చేరికగా, షవోమీ 14 CIVIని విడుదల చేసింది. లైకా కోఇంజనీరింగ్‌తో తయారైన, షవోమీ 14 CIVI మొబైల్ ఇమేజింగ్, స్మార్ట్‌ఫోన్ ఫోటోగ్రఫీలో షవోమీ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతుంది. షవోమీ 14 CIVI కెమెరా పనితీరును రెట్టింపు చేస్తుంది. అలాగే, షవోమీ 14 సిరీస్ ఐకానిక్ డిజైన్ లాంగ్వేజ్‌ను వారసత్వంగా అందుకుంటూ, ఫ్లాగ్‌షిప్ సెగ్మెంట్‌లో గణనీయమైన పరిణామాన్ని సూచిస్తుంది. అత్యాధునిక ఆవిష్కరణలను అందరికీ అందుబాటులో ఉంచడంలో షవోమీ కొనసాగిస్తున్న నిబద్ధతను ఇది ప్రదర్శిస్తుంది. "లైకా కోఇంజనీరింగ్‌తో తయారు చేసిన షవోమీ 14 సిరీస్ దక్కించుకున్న అద్భుతమైన విజయాన్ని పరిగణనలోకి తీసుకుని, షవోమీ 14 CIVI తాజా జోడింపును మా ఉత్పత్తుల శ్రేణిలో ప్రకటిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము" అని షవోమీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనూజ్ శర్మ పేర్కొన్నారు.

## ఆ గ్రామస్తులు ఏటా
# 5 కోట్ల పన్నులు చెల్లిస్తారు

### ఊరి వీధుల్లో, పొలాల్లో బస్సులు, ట్రక్కులే ▪ ఆ గ్రామంలో అందరూ ధనవంతులే..

**ముందడుగు రాజస్థాన్:**

రాజస్థాన్ లోని ఒక గ్రామంలో అందరూ ధనవంతులే.. ఆ గ్రామంలో పన్నులు కోట్లులో చెల్లిస్తారు. అదే బికానెర్‌లోని నోఖా సబ్‌డివిజన్ ప్రాంతంలో ఉన్న రాసిసర్ అనే గ్రామం. ఈ గ్రామం రాజస్థాన్ రాష్ట్రంలోని అనేక జిల్లాల కంటే ఎక్కువ ఆదాయాన్ని ఇస్తుంది. ఈ నోఖా గ్రామ ఆర్థిక వ్యవస్థ చక్రాలపై తిరుగుతుంది. ఇక్కడ నివసించే ప్రజలు ఏటా రూ.5 కోట్ల పన్ను చెల్లిస్తున్నారంటే వారి శ్రేయస్సును అంచనా వేయవచ్చు.

### ఆ గ్రామంలో 1500 ట్రక్కులు-ట్రాలీలు

రాసిసర్ గ్రామ జనాభా 15 వేలు. కోట్లాది రూపాయల విలువైన 1500 ట్రక్కులుట్రాలీలు, వందలాది బస్సుల యజమానులు ఇక్కడ నివసిస్తున్నారు. ఈ గ్రామంలో ఉన్న ట్రక్కులు, బస్సుల సంఖ్య, వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని దృష్టిలో ఉంచుకుని పాలనా యంత్రాంగం నోఖాలో ప్రత్యేక డీటీఓ కార్యాలయాన్ని ప్రారంభించాల్సి వచ్చింది. ప్రస్తుతం నోఖా డీటీఓ కార్యాలయం వార్షిక ఆదాయ వసూళ్ల లక్ష్యం రూ.46.53 కోట్లు. ఊరి వీధుల్లో, పొలాల్లో బస్సులు, ట్రక్కులు మాత్రమే కనిపిస్తాయి. రాష్ట్రంలో ఇన్ని ట్రక్కులు, బస్సులు ఉన్న ఏకైక గ్రామం రాసిసర్ గా రికార్డు సృష్టించింది.



### అన్ని వాహనాలపై గ్రామం పేరే

గ్రామంలో చిన్న, పెద్ద వాహనాలు కలిసి ఐదు వేలకు పైగా ఉన్నాయి. గ్రామంలో సుమారు 1500 ట్రక్కులు, ట్రైలర్లు, డంపర్లు, 125 చిన్న, పెద్ద బస్సులు, 728 పికప్‌క్యాంప్‌లు, 806 లగ్జరీ కార్లు, ఆటోలతో సహా అనేక వాహనాలు ఉన్నాయి. గ్రామంలో 2000కు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. గ్రామంలోని అన్ని వాహనాలపై గ్రామం పేరే కనిపిస్తుంది. ఈ కోటీశ్వరుడు గ్రామంలో రెండు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గ్రామంలో విద్యుత్, నీరు, వైద్యం, రోడ్లు సహా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ఐదు ప్రభుత్వ పాఠశాలలు, CHC మరియు ఆయుర్వేద ఆసుపత్రి మరియు ఒక పశువైద్యశాల ఉన్నాయి.

## 60 హైస్పీడ్ ఎల్ కాస్మోఐఐఐఎల్ ఎలివేటర్‌లను సరఫరా చేయనున్న తోషిబా జాన్సన్ ఎలివేటర్స్

**హైదరాబాద్:**

ప్రముఖ ఎలివేటర్ మరియు ఎస్కలేటర్ కంపెనీ, తోషిబా జాన్సన్ ఎలివేటర్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ (టిజెఈఐ), ట్యూలిప్ గ్రూప్ ప్లాంటినమ్ కలెక్షన్ ట్యూలిప్ మొన్సెల్లాకు 60 హైస్పీడ్ ఎల్ కాస్మోఐఐఐఎల్ ఎలివేటర్ లను సరఫరా చేసే ప్రతిష్టాత్మకమైన ఆర్డర్ ను గెలుచుకున్నట్లు ఈ రోజు ప్రకటించింది.

ఈ కొత్త భాగస్వామ్యం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ కత్సుహికో సాటో, మేనేజింగ్ డైరెక్టర్, టిజెఈఐ, "మా విలువైన వినియోగదారుల అంచనాలను మించేలా అత్యుత్తమ ఎలివేటర్‌లను నిరంతరంగా అందించడానికి తోషిబా ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది. తోషిబా ఎలివేటర్‌లపై ట్యూలిప్ ఇన్ఫ్రాటెక్ చూపిన విశ్వాసం, ఆకర్షణీయమైన మరియు విలాసవంతమైన పట్టణ వాతావరణంలో ప్రజలు సజావుగా, సురక్షితంగా, సౌకర్యంగా మరియు వేగవంతంగా కదలడానికి సహాయపడే మా సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. ట్యూలిప్ ఇన్ఫ్రాటెక్ భాగస్వామిగా ఎంపికైనందుకు మాకు గౌరవకారణం మరియు మేము ఈ బాధ్యతను గర్వంగా స్వీకరిస్తున్నాము, మేము ఇన్ స్టాల్ చేసే ప్రతి ఎలివేటర్ నాణ్యత, భద్రత, విశ్వసనీయత మరియు అందంలో తోషిబా ప్రమాణాలను అందుకునేలా నిర్ధారిస్తాము" అని అన్నారు.




# ఉచితాలు వద్దు.. ఉపాధి ముద్దు..

ఈ మధ్యకాలంలో ప్రభుత్వాలు ఉచితంగా నగదు ఇవ్వడం, ఉచిత ప్రయాణంలు హామీలు ఇస్తూ అధికారం చేజిక్కించుకుంటున్నాయి. వికలాంగులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగస్తుల వరకు ఉచిత నగదు పంపిణీ బాగానే ఉంది కానీ సమాజంలో ఉన్న అన్ని వర్గాలకు పురుషులకు, మహిళలకు ఏదో ఒక రూపంగా నగదు రూపంలో డబ్బులు అందజేయడం అనేది భవిష్యత్తు తరాలకు అంత శ్రేయస్కరం కాదు. ఎందుకంటే ఈ నగదు బదిలీ కోసం ప్రభుత్వాలు లేదా ఆ పార్టీలు సొంత నిధులు అయితే వెచ్చించవు. ప్రజలపైనే ఏదో ఒక రూపంలో పన్నులు వేసి ఆ డబ్బులు రాబట్టుకుంటాయి. కుడి చేత్తో ఇచ్చి ఎడం చేత్తో తీసుకోవడం ఎంతవరకు సమంజసం. అలాకాకుండా ప్రతి కుటుంబానికి ఉద్యోగం. ఉపాధి, కుటీర పరిశ్రమలు లాంటివి ప్రోత్సహించి వారు సంపాదించుకొనడమే కాకుండా ఇంకో నలుగురికి పని కనిపించేలాగా పథకాలు రూపకల్పన చేస్తే బాగుంటుంది. అప్పుడు మార్కెట్లో కొనుగోలుదారుడు ఉత్పత్తిదారుడు బాగుంటారు. ప్రభుత్వాలు ఈ దిశగా ఆలోచించాలి..



**- మారియా అంతోని,**
**కార్యదర్శి, యూత్ ఫర్ యాంటీ కరప్షన్**

ముందడుగు
గురువారం, 13-6-2024, హైదరాబాద్

# ములుగులో పరమేశ్వర ప్లైయాక్స్ బ్రిక్స్ ప్రారంభం



**ములుగు ముందడుగు:**

ములుగు జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్ ఎదురుగా బుధవారం పరమేశ్వర ప్లైయాక్స్ బ్రిక్స్ నూతన బ్రాంచ్‌ను వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన ప్రొప్రైటర్ రామిడి కృష్ణారెడ్డి ప్రారంభించారు. ములుగు జిల్లా కేంద్రంలోని ప్రజలకే కాకుండా, చుట్టుప్రక్కల మండలాలు, గ్రామాల ప్రజలకు నాణ్యతతో కూడిన సిమెంట్ బ్రిక్స్ అందించనున్నామని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కుటుంబసభ్యులతో పాటు, బంధువులు స్నేహితులు మిల్కూరి అయిలయ్య, మేడబోయిన అశోక్, పోశాల వీర మల్లు, నూనె అశోక్, వెంకటాపూర్, ములుగు మండలాలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# కల్కి బుజ్జి కారుని నడిపిన ఆనంద్ మహీంద్ర..





సినీ ప్రేక్షకులు ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రాలలో పాన్ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'కల్కి 2898 AD' ఒకటి. ఈ సినిమాకు మహానటి ఫేమ్ నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తుండగా.. వైజయంతి మూవీస్ బ్యానర్‌పై అశ్విన్ దత్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాడు. దీపికా పదుకొనే, దిశా పటానీ కథానాయికలుగా నటిస్తుండగా.. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, కీలక పాత్రలు పోషిస్తున్నారు. జూన్ 27న ప్రేక్షకుల ముందుకు సినిమా రానుంది. విడుదలకు ఇంకా 15 రోజులే ఉండడంతో ప్రమోషన్స్ వేగం పెంచింది చిత్రయూనిట్. రీసెంట్‌గా మూవీ నుంచి ట్రైలర్‌ను విడుదల చేయగా.. యూట్యూబ్‌లో రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. అయితే కల్కి ప్రమోషన్స్‌లో స్పెషల్ హైలైట్ బుజ్జి కారు అని తెలిసిందే. ఇప్పటికే భైరవ (ప్రభాస్) బుజ్జి ఈవెంట్‌ను రామోజీ ఫిలిం సిటీలో నిర్వహించగా ఈ ఈవెంట్ సూపర్ హిట్ అయ్యింది. అయితే బుజ్జి కారు ప్రస్తుతం ఇండియా వైడ్ ప్రమోషన్స్‌లో పాల్గొటుంది. అయితే తాజాగా ఈ కారును ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా నడిపాడు. ఇక బుజ్జిని డ్రైవ్ చేసిన వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ ట్విట్టర్‌లో షేర్ చేసింది.

## జిల్లా బాల సదనంలో ఏర్పాట్లు

# సంతృప్తికరం

### బాల సదనాన్ని సందర్శించిన డిఐసి బృందం



**ములుగు ముందడుగు:**

ములుగు జిల్లా కేంద్రంలోని బాల సదనాన్ని జిల్లా తనిఖీ కమిటీ సభ్యులు సందర్శించారు. బాల సదనంలో పరిశుభ్రత, ఆరోగ్యం, చదువు, నాణ్యమైన ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం, మౌళిక సదుపాయాలు, రక్షణ వ్యవస్థ, పారిశుధ్యం తదితర సౌకర్యాలు వంటి అంశాలతో కూడిన ప్రశ్నావళితో సరిచూసుకుని తనిఖీ నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ సిహెచ్ మహేందర్ జీ చైర్మన్ గా ఏర్పాటైన ఈ జిల్లా తనిఖీ కమిటీ బాల సదనాన్ని సందర్శించి పై అంశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారిణి జె.ఎం స్వర్ణలత లెనినా, జిల్లా తనిఖీ కమిటీ మెంబర్ సెక్రటరీ జె. ఓంకార్, సభ్యులు డా. శ్రీకాంత్, డా. నమ్రత, పింగిలి నాగరాజు, లూర్దు రాజు తదితరులు పాల్గొన్నారు



## అల్లు అర్జున్‌ను అన్‌ఫాలో చేసిన

# సాయి ధరమ్ తేజ్.!

ఆంధ్రప్రదేశ్‌రాష్ట్రంలో నేడు కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ఏపీ నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడుతో పాటు ఉప ముఖ్యమంత్రిగా పవన్ కల్యాణ్ ప్రమాణస్వీకారం చేశారు. ఇక సీఎం, డిప్యూటీ సీఎంగా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం చేయడంతో రాజకీయ ప్రముఖులతో పాటు సినీ ప్రముఖులు వారికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే ఈ వేడుకకు అల్లు ఫ్యామిలీ దురంగా ఉన్న విషయం తెలిసిందే. పవన్ కళ్యాణ్ మొన్న చిరంజీవి ఇంటికి వెళ్లినప్పుడు అయిన.. నేడు ప్రమాణ స్వీకార వేడుకలో అయిన అల్లువారి కుటుంబం కనిపించలేదు. దీంతో మెగా ఫ్యామిలీకి, అల్లు ఫ్యామిలీకి గొడవ అయినట్లు సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. అయితే ఈ నేపథ్యంలోనే ఒక షాకింగ్ న్యూస్ బయటకు వచ్చింది. మెగా హీరో సాయి ధరమ్ తేజ్ అల్లు అర్జున్, స్నేహారెడ్డిని సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేశాడు. ఇంతకుముందు అర్జున్, స్నేహాని ఫాలో అవుతున్న సాయి తేజ్ తాజాగా అన్‌ఫాలో చేసినట్లు తెలుస్తుంది.

కాగా ఇప్పటికే మెగా ఫ్యాన్స్, అల్లు ఫ్యాన్స్ మధ్య గొడవ జరుగుతుండగా ఈ వివాదం ఎంతవరకు వెళుతుందని ఫ్యాన్స్ చర్చించుకుంటున్నారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికలలో అల్లు అర్జున్ పవన్ కల్యాణ్‌కు మద్దతునిస్తునే నంద్యాల వైసీపీ అభ్యర్థి కోసం మాత్రం ఇంటికి వెళ్లి మరీ ప్రచారం చేశారు. దీంతో ఈ విషయంపై నాగబాబు స్పందిస్తూ.. పరాయివాడు అంటూ ట్వీట్ చేసి డిలీట్ చేశాడు. దీంతో అప్పటినుంచి ఈ విషయం హాట్ టాపిక్‌గా మారింది.

# రెండు వారాల ముందుగా..?



ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, సైఫ్‌అలీ ఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతం నేపథ్యంలో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

దసరా కానుకగా అక్టోబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. కాగా ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో ఓ ఆసక్తికరమైన న్యూస్ ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. అనుకున్న సమయానికంటే రెండు వారాల ముందుగానే 'దేవర' ప్రేక్షకుల్ని పలకరించబోతున్నాడని సమాచారం. సెప్టెంబర్ 27కు ఈ చిత్రాన్ని ప్రీపోన్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. అదే తేదీకి పవన్‌కల్యాణ్ 'ఓజీ' విడుదల కావాల్సి ఉంది. అయితే షూటింగ్‌లో ఆలస్యం కారణంగా రిలీజ్‌ను వాయిదా వేశారు. ఇప్పుడు అదే తేదీకి 'దేవర' రానుందనే టాక్ వినిపిస్తున్నది. అయితే ఇవి కేవలం ఊహాగానాలు మాత్రమేనని, చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చినప్పుడే ఈ విషయంలో స్పష్టత వస్తుందని చెబుతున్నారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.